సాక్షి జనగామ

బుధవారం | 4 | జూన్ | 2025



బీజేపీ దేశానికి శత్రువు

బీజేపీ దేశానికి శత్రువని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నర్మెటలో జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. - 8లో▸



కొలువులు కోకొల్లలు - 8లో▸

ఐటీఐ విద్యను పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. దీంతో రోజురోజుకూ సాంకేతిక విద్యకు ఆదరణ పెరుగుతోంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36^0 /27^0

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో సిబ్బందిని నియమించాలి



చిల్పూరు: పశువుల ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజీగూడెం గ్రామంలో మంగళవారం గొర్రెలమేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు మోటె దేవేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవీందర్ హాజరై మాట్లాడుతూ పాడి పరిశ్రమతోనే ప్రభుత్వాలకు ఆదాయం వస్తుందంటూ ఒకపక్క నాయకులు అంటూనే మరోపక్క వాటి సంక్షేమాన్ని పట్టించుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. రెండేళ్లుగా గొర్రెలుమేకలు, పాడి పశువులకు ప్రభుత్వం నుంచి కనీసం నట్టల మందులను ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఒక్క అటెండర్ పోస్టును భర్తీ చేయలేదని, కనీసం నేటికి పశుసంవర్ధక శాఖ మంత్రిని నియమించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే అన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని నియమించాలని, అన్ని రకాల మందులను పాడి రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాదం రమేష్, బాలరాజు, రమేష్, రాజబీరయ్య, మేకల మల్లేష్, చంద్రయ్య, బోళ్ల రాజ్‌కుమార్, ఆవుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

జనగామ రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయని డీఈఓ డి.భోజన్న మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మకంచలో జరిగిన తెలుగు పరీక్షలో 51 మంది విద్యార్థులకు గాను 48 మంది హాజరు కాగా 3 గైర్హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని డీఈఓ, ఏసీజీఈ రవికుమార్‌లు సందర్శించారు.

సందీప్‌కు రాష్ట్ర ప్రతిభా పురస్కారం



పాలకుర్తి టౌన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఈగ సందీప్ రాష్ట్ర ప్రతిభా పురస్కారం అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర హాస్టల్‌లో ఉంటూ సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో 557 మార్కులు సాధించారు. దీంతో విద్యార్థికి ప్రోత్సాహకంగా మెమెంటోను అందించారు. జిల్లా నుంచి బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థి పురస్కారం అందుకోవడంతో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్‌గౌడ్ విద్యార్థి సందీప్‌ను అభినందించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో 18 వార్డుల కేటాయింపు

స్టేషన్‌ఘన్‌పూర్: నూతనంగా ఏర్పడిన స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీకి అధికారికంగా 18 వార్డులను కేటాయించినట్లు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టీకే శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డుల వారీగా పబ్లిక్ నోటిఫికేషన్‌ను మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తామని, ఏమైనా అభ్యంతరాలుంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి పరిశోధన పద్ధతులపై తరగతులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు పరిశోధనా పద్ధతులపై అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బీఓఎస్ డాక్టర్ కిష్టయ్యతో కలిసి ఆవిష్కరించారు. యూనివర్సిటీకి చెందిన సీనియర్ ఆచార్యులతో ఈఅవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోషల్ సైన్సెస్ పరిశోధకులు కూడా ఈపరిశోధనా పద్ధతుల అవగాహన తరగతుల్ని వినియోగించుకోవాలని కోరారు. ఈనెల 4న ఈతరగతులను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, సోషల్ సైన్స్ ఆచార్య టి.మనోహర్ ప్రారంభిస్తారని సంకినేని వెంకటయ్య తెలిపారు. అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

75 మంది జీపీఓలు

- 116 మంది పరీక్షకు హాజరు, 75 మంది క్వాలిఫై
- జిల్లాలో 176 రెవెన్యూ గ్రామాలు
- ఒక్కో జీపీఓకు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలు
- సీఎం చేతుల మీదుగా త్వరలో ఆర్డర్ కాపీలు!




సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

జనగామ: ఇటీవల జీపీఓలుగా నియమించేందుకు నిర్వహించిన పరీక్షకు జిల్లాలో 116 మంది వీఆర్ఏ, వీఆర్‌ఓలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 75 మంది జీపీఓలుగా అర్హత సాధించారు. బీఆర్ఎస్ హయాంలో వీఆర్‌ఓ, వీఆర్ఏ వ్యవస్థను మంగళం పాడి.. రెవెన్యూ వ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి.. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతను తహసీల్దార్లకు అప్పగించారు. వీఆర్ఏ, వీఆర్‌ఓల అర్హత ఆధారంగా ఆయా శాఖలో విలీనం చేయగా... రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో పెద్ద లోటు ఏర్పడింది. తహసీల్దార్, ఆర్డీఓ పరిధిలో ఉన్న పలు ఆప్షన్లను తొలగించడంతో రైతులు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. ధరణి పోర్టల్‌పై వచ్చిన నిరసన నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమూల మార్పులు తీసుకు వస్తామని అనేక సభల్లో నేతలు వాగ్దానాలు చేశారు. గతేడాది జరిగిన సాధారణ ఎలక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే... ధరణి పోర్టల్‌కు స్వస్తి పలికి భూ భారతికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న నిబంధనలను తిరిగి అమలులోకి తీసుకు రావడంతో పాటు వీఆర్‌ఓ, వీఆర్ఏల స్థానంలో గ్రామ పరిపాలన అధికారుల (జీపీఓ) వ్యవస్థను తీసుకువచ్చారు.

75 మంది క్వాలిఫై

జిల్లాలో 12 మండలాలు, 280 గ్రామ పంచాయతీలు ఉండగా, 176 రెవెన్యూ విలేజ్‌లు ఉన్నాయి. గతంలో వీఆర్‌ఓ, వీఆర్ఏలుగా పని చేస్తూ ఇతర శాఖల్లో పని చేస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు అవకాశం కల్పించింది. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ స్థానంలో కొత్తగా జీపీఓగా నామకరణం చేసింది. నేరుగా జీపీఓగా బాధ్యతలను స్వీకరించేందుకు, ఇంటర్, డిగ్రీ అర్హత నిబంధన విధించారు. అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను కోరారు. జిల్లాలో 116 మంది వీఆర్ఏ, వీఆర్‌ఓలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో 97 మంది అర్హత సాధించారు. ఇందులో 86 మంది రాత పరీక్షకు హాజరు కాగా, 11 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలో 75 మంది జీపీఓలుగా అర్హత సాధించారు. ఇందులో ఒక్కరు నాట్ విల్లింగ్ ఇవ్వగా, ముగ్గురు ఇతర జిల్లాలకు ఆప్షన్ ఇచ్చారు. మిగిలిన 71 మందికి జనగామ సొంత జిల్లాలో పని చేసే అవకాశం వచ్చింది. ఆప్షన్ ప్రక్రియ ముగిసిపోగా...జీపీఓలను జిల్లాల వారీగా అలాట్ చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే, కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక్కో జీపీఓకు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించనున్నారు.

జీపీఓల విధులివే..



- రెవెన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించడం.
- భూమిశిస్తు, సెస్సులు, పన్నులు, ఇతర బకాయిలను వసూలు చేయాలి.
- సర్వే రాళ్ల తనిఖీ.
- జన్మస్థల ధ్రువపత్రములు, సాల్వెన్సీ, నివాస, సర్టిఫికెట్లు, జారీ
- పహాణీ, అడంగల్ తదితర పనులు.
- అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు ఇతర విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ఉన్నతాధికారులకు సమాచారం అందించడం.
- ప్రభుత్వ భూములు, చెరువులు, చెట్లు, ఇతర ఆస్తుల పరిరక్షణ.
- పురాతన కట్టడాల కూల్చివేత, శిలాశాసనాలు, స్మారక చిహ్నాలు లభ్యమైన సమయంలో తహసీల్దార్లకు సమాచారం అందించాలి.
- ఓటర్ల జాబితాల తయారీ, అప్డేట్, సవరణ సమయంలో సహకారం.
- హత్యలు, ఆత్మహత్యలు, అసహజ మరణాలు, గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలి.
- ఇందిరమ్మ, ఇందిర ప్రభ, ఇందిర క్రాంతి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సహకరించాలి.
- మలేరియా, మెదడు వాపు, అతిసారం వంటి వ్యాధులు ప్రబలిన సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తక్షణం తెలియజేయాలి.

అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యభూమిక పోషిస్తాం..



మాతృ సంస్థ రెవెన్యూ వ్యవస్థలో తిరిగి పని చేసే అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు. రాబోయే రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య భూమిక పోషిస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తాం.

\- పెండెల శ్రీనివాస్, జీపీఓ

'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



లింగాలఘణపురం: అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం జనగామ మండలం పెంబర్తి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూసదస్సు నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి విడత సదస్సులు విజయవంతంగా ముగిశాయని, జూన్ 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. భూ రికార్డులో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆర్డీఓ గోపిరామ్ దరఖాస్తు ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరిగా ఇవ్వాలి

లింగాలఘణపురం: రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. మంగళవారం లింగాలఘణపురం మండలం నాగారం గ్రామాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.

'బక్రీద్'ను ప్రశాంతంగా జరుపుకోవాలి

జనగామ రూరల్: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌లతో కలిసి ముస్లింలు, హిందువులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గోవధ నిషేధమని, గోమాతను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై సంబంధిత శాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. అర్హులకు మంజూరు పత్రాలు అందించి 9వ తేదీలోపు ముగ్గుపోసిన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే రేషన్ సన్నబియ్యం పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ వేణుమాధవ్

జనగామ రూరల్: నెట్‌వర్క్, టీవీ కేబుల్స్ ద్వారా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఈ వేణుమాధవ్ అన్నారు. మంగళవారం జనగామ డివిజన్ పరిధిలోని ఏడు మండలాలు బచ్చన్నపేట, లింగాలఘణపురం, రఘునాథపల్లి, నర్మెట, తరిగొప్పుల, దేవరుప్పుల, జనగామ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేబుల్ టీవీ ఆపరేటర్స్, ఇంటర్నెట్ నెట్‌వర్క్ ఆపరేటర్స్, డిస్ట్రిబ్యూటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెగిపోయిన కేబుల్ తీసేసి కొత్త కేబుల్ వేయాలని, గాలిలో వేలాడకుండా చూడాలన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ లక్ష్మీ నారాయణ రెడ్డి, డీఈ టెక్నికల్ గణేష్, జయరాజు , ఏడీలు, ఏఏఓ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం



విత్తన ప్యాకెట్లను అందజేస్తున్న ఏరువాక శాస్త్రవేత్త విశ్వతేజ



రఘునాథపల్లి: విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ రామారావునాయక్

లింగాలఘణపురం: ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనాలు అందజేయడమే లక్ష్యమని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏరువాక శాస్త్రవేత్త విశ్వతేజ అన్నారు. మంగళవారం మండలంలోని సిరిపురం రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మూలవిత్తనాలను రైతులకు ఇచ్చి వాటి నుంచి విత్తనోత్పత్తి చేసి ఆ విత్తనాలను గ్రామంలోని రైతులకు అందజేయడం జరుగుతుందని, అందులో భాగంగా మండలానికి 28 వరి విత్తన ప్యాకెట్లు, 14 పెసర కిట్లు పంపిణీ చేశామన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని విత్తనాలను ఉత్పత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓలు స్పందన, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు అందజేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వరి, పెసర విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులు పొందిన విత్తనాలు సాగు చేసి తిరిగి గ్రామ రైతులకు విత్తనోత్పత్తి కోసం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఓ వసంత సుగుణ, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, ఏఈఓ కల్యాణి పాల్గొన్నారు.

'బెస్ట్ ప్రాక్టీస్' రాష్ట్ర సదస్సుకు ఎంపిక

- జిల్లా నుంచి హాజరుకానున్న ఐదుగురు ఉపాధ్యాయులు

జనగామ: సర్కారు బడుల్లో విద్యాబోధనలో మరిన్ని మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల బంగారు భవిష్యత్, బడుల అభివృద్ధికి శ్రమిస్తున్న ఉపాధ్యాయులపై ఫోకస్ సారించారు. ఉత్తమ విధానాలను ఎంపిక చేసుకుని పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్న జిల్లాలోని ఐదుగురు ఉపాధ్యాయులను రాష్ట్ర స్థాయి (బెస్ట్ ప్రాక్టీస్) సదస్సుకు ఎంపిక చేసింది.

నేటి నుంచి సదస్సు

హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నేటి (బుధవారం) నుంచి విద్యాస్థాయి పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సదస్సు ప్రారంభం కానుంది. నూతన అభ్యసన ప్రక్రియకు సంబంధించి ఉత్తమ ప్రదర్శనలకు ఎంపికైన వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ప్రదర్శించనున్నారు.

వినూత్న పద్ధతులు



విద్యార్థుల్లో కొత్తదనం నింపడం, వినూత్న పద్ధతుల ద్వారా బోధన. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ స్కూల్‌లో బ్యాంకు నిర్వహణ తదితర అంశాలు రాష్ట్ర స్థాయి సదస్సుకు ఎంపికయ్యేలా చేశాయి.

\- డి.వెంకటేశ్వర్లు, స్కూల్ అసిస్టెంట్, సోషల్, జెడ్పీఎస్ఎస్, చిల్పూర్

మెమోరీ గేమ్స్‌లో..



గణితంతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధన. పిల్లవాడి మెమోరీ పవర్‌ను అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా లెక్కల పాఠాలు బోధించడంలో పాటించిన పద్ధతులను రాష్ట్ర స్థాయి సదస్సుకు ఎంపికయ్యేలా చేసింది.

\- కె.శిరీషరాణి, టీజీటీ మ్యాథ్స్, మోడల్ స్కూల్, కొడకండ్ల

చదువుపై ఆసక్తి కల్పించడం..



వినూత్న పద్ధతులను అవలంబిస్తూ బోధించడం. క్వాలిటీ బోధన అందించే క్రమంలో విద్యార్థులకు చక్కటి మెళకువలను నేర్పించడం. చదువుపై ఆసక్తి కలిగించడం.

\- ఎం.పద్మారాణి, పెద్దమడూరు,పీఎస్, దేవరుప్పుల

క్రమశిక్షణ, అభ్యసన సామర్థ్యాలను పెంచడంలో..



విద్యార్థుల హాజరు శాతంలో ఉత్తమం. క్రమశిక్షణ, అభ్యసన సామర్థ్యాలను పెంచడంలో పాటించే పద్ధతులు బెస్ట్ ప్రాక్టీసెస్ విభాగంలో రాష్ట్ర సదస్సుకు ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్, గ్రామ పెద్దల సహకారంతో ఈ ఘనత సాధించారు. ఈ బడిలో ఇద్దరు అక్కాచెల్లెల్లు హాజరు శాతంలో వంద మార్కులు కొట్టేశారు.

\- ఆర్.రామ్మోహన్ రెడ్డి, ఎస్జీటీ, మాన్‌సింగ్‌తండా, పీఎస్, నర్మెట

కాగితపు బొమ్మలు..



పాఠశాలలో విద్యార్థులకు కాగితపు బొమ్మలతో (ఒరిగామి) వినూత్న బోధన రాష్ట్ర సదస్సుకు ఎంపిక చేసింది. కాగితపు బొమ్మలతో పాఠాలు చెప్పడంతో పాటు పిల్లలతో సైతం నాటక ప్రదర్శనలు చేయిస్తూ, పాఠ్యపుస్తకంలో ఉన్న అంశాలను ఈజీగా అర్థం చేసుకునేలా చేయడం. ఇక్కడ బోధించే అంశాలను రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రదర్శన చేస్తా.

\- ఎస్.జయపాల్‌రెడ్డి,ఎస్జీటీ, పీఎస్, బాంజీపేట, రఘునాథపల్లి

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా



కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, గుడిసెవాసులు

జనగామ రూరల్: లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం గ్రామ శివారులో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం గుడిసెవాసుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల క్రితం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పటేల్‌గూడెం శివారులో ప్రభుత్వ భూమిలో ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, వర్షాకాలం సమీపించడంతో గుడిసెలను సరి చేసుకుంటున్న పేదలపై లింగాలఘణపురం తహసీల్దార్, పోలీసులు గుడిసెల వద్దకు వచ్చి ఖాళీ చేయాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రాత్రి సమయంలో కూడా గుడిసెవాసుల వద్దకు వెళ్లి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైన కలెక్టర్ స్పందించిన తహసీల్దార్, సీఐ, ఎస్సైపై చర్య తీసుకొని, గుడిసెవాసులపై వేధింపులు ఆపాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ మన్సూర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్, సుంచు విజేందర్, జోగు ప్రకాష్, ఉపేందర్, కర్ణాకర్, శంకరయ్య, దేవదానం, నాయకులు పాల్గొన్నారు.

విదేశీ విద్య ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: అల్ప సంఖ్యాక వర్గాల వారు విదేశాల్లో ఉన్నత చదువుల నిమిత్తం సీఎం విదేశీ విద్యా పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.విక్రమ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద ఆర్థిక సాయం కోసం రూ.20 లక్షలు, విమాన ప్రయాణచార్జీలు రూ.60వేలు చెల్లిస్తారన్నారు. విద్యార్థులు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9951933034, 9059679793 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐటీఐ శిక్షణకు..

ఐటీఐ శిక్షణకు మొదటి విడత ప్రవేశానికి గాను విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ బి.హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ పద్ధతిన జరుగుతాయని, జూన్ 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866843920 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'ఎక్స్' లో 'సాక్షి' కథనం



సాక్షి కథనాన్ని ఎక్స్‌లో పోస్టు చేసిన సీపీఆర్వో టు సీఎం

జనగామ: 'జనగామ జిల్లాకేంద్రంలోని కుర్మవాడకు చెందిన దివ్యాంగుడు పర్శ సాయి కుటుంబం పడుతున్న వేదనను చూసి సీఎం రేవంత్‌రెడ్డి చలించిపోయారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ కాపీని అందించాం' అంటూ మంగళవారం సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తా కథనాన్ని ఎక్స్‌లో సీపీఆర్వో టు సీఎం పోస్టు చేశారు. సాక్షితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాకు పర్శ సాయి కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలి



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- సీపీ సన్‌ప్రీత్‌సింగ్
- కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతీ అధికారి పోలీసింగ్‌పై దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మంగళవారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆస్తి నేరాలను తగ్గించాలని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు కారణాల్ని అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి సూచనలిచ్చారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన కమ్యూనిటి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. వాహనాల చోరీలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మూగజీవాల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పండుగ రోజు దర్గాల వద్ద బందోబస్తు పట్టిష్టం చేయాలని, వరంగల్‌కు ఉన్న కీర్తి ప్రతిష్టలు తగ్గకుండా పోలీసింగ్ ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో బెసిక్ పోలీసింగ్ ఉండాలని సీపీ ఆదేశించారు. డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్ కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న ఎస్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవ వేడుకలు ఈనెల 6న ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈమేరకు మంగళవారం ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ ప్రకటించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం సందర్భంగా కీరవాణికి డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు దీపక్‌గార్గ్ తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మహేశ్, స్నాతకోత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు



హన్మకొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విత్తనమేళాతోపాటు 'నాణ్యమైన విత్తనం – రైతుకు నేస్తం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తనమేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఉమారెడ్డి పాల్గొని రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకు అందజేసిన నాణ్యమైన విత్తనాన్ని ఎవరి గ్రామాల్లో వారే పండించుకోవాలన్నారు. తద్వారా సాగు ఖర్చు తగ్గడమే కాకుండా ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడాల్సిన అవసరముండదన్నారు. ఈ క్రమంలో ప్రతీ గ్రామంలో రైతులు విత్తనాన్ని పండించుకోవడానికి వీలుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా మూల విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. శాస్త్రవేత్తలు అవసరమైన మెళకువలు నేర్పుతున్నారన్నారు.

పదవీ విరమణ అభినందన సభ



మడికొండ: విద్యుత్‌శాఖ ఏడీఈ నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు పదవీ విరమణ సభ మంగళవారం రాత్రి మడికొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ(సీతక్క) హాజరై సన్మానించారు. ఉద్యోగంలో పదవి విరమణ సాధారణమని, వృత్తి పరంగా ఆయన సేవలను సంస్థ సద్వినియోగం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, సుస్మితా పటేల్, ఈవీ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ అధికారులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



కొలువులు.. కోకొల్లలు

ఐటీఐతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలం
- సాంకేతిక విద్య కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జూన్ 21 వరకు గడువు.. ఏ ట్రేడ్‌కు అయినా ఒక్కటే దరఖాస్తు



కాజీపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనం

కాజీపేట : ఐటీఐ.. జాబ్ ఓరియెంటెడ్ కోర్సు. వివిధ రకాల ట్రేడ్‌లు. పైగా స్వల్ప కాలిక కోర్సు. రెండు సంవత్సరాలు కష్టపడి ఈ సాంకేతిక విద్యను పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలం. అందుకే ఈ కోర్సుకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పారిశ్రామిక సాంకేతిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సాంకేతిక విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 21వ తేదీ వరకు గడువు విధించారు. ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్ చేస్తే స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

గ్రేడింగ్ ఆధారంగా సీట్ల కేటాయింపు..

ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, మరికొన్ని ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలు ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఏటూరునాగారంలో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, సివిల్, కంప్యూటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, షార్ట్ హ్యాండ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో గ్రేడింగ్ ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుంది.

దరఖాస్తు ఇలా..

దరఖాస్తు చేయడానికి iti.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. కుడివైపున విద్యార్థి లాగిన్‌ను ఓపెన్‌చేయాలి. కొత్త రిజిస్ట్రేషన్‌ను ఎంచుకుని సెల్‌ఫోన్ నంబర్, మెయిల్ ఐడీని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. సెల్‌ఫోన్‌కు యూజర్ నేమ్, పాస్‌వర్డ్ వస్తుంది. వాటి ఆధారంగా విద్యార్థి వివరాలను నమోదు చేయడంతోపాటు, పదో తరగతి, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఐటీఐ పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఏ ట్రేడ్‌కు అయినా ఒకటే దరఖాస్తు సరిపోతుంది.

– వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్, కాజీపేట ఐటీఐ

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీవీటీ విధానం, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పనిచేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కేసముద్రం: అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని వేం నరేందర్‌రెడ్డితోపాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేస్తామన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం చేసి ఆ తర్వాత రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే భుక్యా మురళీనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తోందన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు వేదికపైనున్న వారంతా కృషి చేయాలన్నారు. ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు సంబంధించి నిధులు కట్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, గ్రాయత్రీ గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్‌ల చైర్మన్లు దికొండ వెంకన్న, మర్రి రంగారావు, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న, మాలమహానాడు అధ్యక్షుడు లింగాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని అర్పనపల్లిలో కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధి పనులపై నరేందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

రమ్యచంద్రికగౌడ్‌కు బంగారు పతకం



నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన ఈరగాని భిక్షం, సునీత దంపతుల కుమార్తె రమ్యచంద్రికగౌడ్ హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ మేరకు మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా రమ్యచంద్రికగౌడ్ బంగారం పతకం అందుకుంది. దీంతో రమ్యచంద్రికగౌడ్‌కు గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

రైల్వే బ్లాక్‌తో రవాణాకు అంతరాయం

రైళ్ల రద్దు, రీషెడ్యూల్డ్, దారి మళ్లింపు
- 17 రైళ్లు రద్దు..6 దూరం కుదింపు
- 4 ట్రైన్లకు బెల్లంపల్లిలో హాల్టింగ్ ఎత్తివేత
- 3 రైళ్లు దారి మళ్లింపు
- ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు అమలు



కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని బెల్లంపల్లి–రెచ్నీరోడ్ సెక్షన్‌లో ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ (ఎన్ఐ) వర్క్స్ కారణంగా పలు రైళ్ల రవాణాకు అంతరాయం కలగనుంది. కాజీపేట జంక్షన్ నుంచి వయా కాజీపేట మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లు రద్దు, రీషెడ్యూల్డ్, మళ్లింపు చేసినట్లు అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్హార్షా–కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్, బల్హార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కాజీపేట–బల్హార్షా (17035) ప్యాసింజర్, ఈ నెల 19,20వ తేదీల్లో నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–నాగ్‌పూర్ (20102) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ (22533) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ (22534) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పట్నా–చర్లపల్లి (03253) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18వ తేదీన చర్లపల్లి–పట్నా (07255) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 20వ తేదీన చర్లపల్లి–పట్నా (07256) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 16వ తేదీన చర్లపల్లి–రక్సోల్ (07055) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 17వ తేదీన ముజఫర్‌పూర్–సికింద్రాబాద్ (05293) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 19వ తేదీన సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ (05294) ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి–దానాపూర్ (07021) ఎక్స్‌ప్రెస్, సుబేదార్‌గంజ్–చర్లపల్లి (04121) ఎక్స్‌ప్రెస్, రక్సోల్–చర్లపల్లి (07066) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 20వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07022) ఎక్స్‌ప్రెస్.

దారి మళ్లింపు రైళ్లు..

ఈ నెల 19వ తేదీన యశ్వంత్‌పూర్–నిజాముద్దీన్ (15024) ఎక్స్‌ప్రెస్, వయా కాచిగూడ, ముద్కెడ్ మీదుగా, చర్లపల్లి–గోరఖ్‌పూర్ (12590) ఎక్స్‌ప్రెస్, వయా కాజీపేట, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా ఈ నెల 18వ తేదీన గోరఖ్‌పూర్–చర్లపల్లి (12589) ఎక్స్‌ప్రెస్ వయా కాజీపేట, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా దారి మళ్లించారు.

ఆరు రైళ్ల దూరం తగ్గింపు..

ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు భద్రాచలం రోడ్–బల్హార్షా (17033) సింగరేణి బల్హార్షా వెళ్లకుండా కాజీపేట వరకే వచ్చి వెళ్తుంది. సిర్పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి బల్హార్షా వెళ్లకుండా కాజీపేట వరకే వచ్చి వెళ్తుంది. ఈ నెల 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్ కాగజ్‌నగర్‌నగర్ వెళ్లకుండా మంచిర్యాల వరకే వచ్చి వెళ్తుంది.ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్ మంచిర్యాల వరకే వచ్చి వెళ్తుంది.

బెల్లంపల్లిలో పలు రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత..

ఈ నెల 12, 14, 19వ తేదీల్లో మైసూర్–జైపూర్ (12975) ఎక్స్‌ప్రెస్, ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్–న్యూఢిల్లీ (12723) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–దానాపూర్ (12791) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 11,13,16,18,20వ తేదీల్లో తిరుపతి–హజ్రత్ నిజాముద్దీన్ (12707) ఎక్స్‌ప్రెస్‌లకు తాత్కాలికంగా బెల్లంపల్లిలో హాల్టింగ్ ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మహాజాతరకు ముందస్తు ప్రణాళిక

- భారీ వర్షాలకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: మేడారం మహాజాతర–2026లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడారం మహాజాతరలో విధులు నిర్వర్తించిన అధికారులు ప్రస్తుతం జిల్లా అధికారులుగా కొనసాగుతున్నారని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర పరిసరాల్లో ఇప్పటికే రూ. 33 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. జాతరలో నాణ్యతాప్రమాణాలతో శాశ్వత నిర్మాణ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జాతరలో మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా, గద్దెల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. జాతరలో పోలీస్ యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతాఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు సులభంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్లు, పైకప్పులు ఏర్పాటు చేయాలన్నారు.

భారీ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. గ్రామాల్లోని కాల్వల్లో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. ములుగు జిల్లా కేంద్రం నుంచి ఏటూరునాగారం వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వృక్షాలను అటవీశాఖ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పరిశీలించి బలహీనంగా చెట్లను తొలగించాలన్నారు. లోతట్టు గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వరదల సమయంలో రక్షణ చర్యలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాకాలంలో రవాణా సౌకర్యాలు లేని గ్రామాలకు మూడు నెలల సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు. వాగుల సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకు అప్రమత్తతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీజన్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు అవసరమైయ్యే మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం సమిష్టి కృషితో మేడారం మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా, మండల అధికారులు, మేడారం పూజారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దేశానికి శత్రువు..

- బీఆర్ఎస్ దొంగల పార్టీ
- కాంగ్రెస్‌తో అంశాల వారీగా పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నర్మెట: బీజేపీ దేశానికి శత్రువు, బీఆర్ఎస్ దొంగల పార్టీ..కాంగ్రెస్‌తో అంశాల వారీగా పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ జిల్లా 4వ మహాసభల సందర్భంగా మండలకేంద్రంలోని వినాయక గార్డెన్స్‌లో జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం పేరుతో పాకిస్తాన్‌తో కయ్యానికి కాలుదువ్వినా ప్రధాని మోదీ చేసిందేమిలేదన్నారు. ట్రంప్‌తో దోస్తీకట్టి ఎస్ బాస్ అంటూ యుద్ధం విరమించారని, అదానీ, అంబానీ లాంటి బడాబాబుల చేతిలో కీలుబొమ్మన్నారు. మతం పేరుతో దేశంలో చిచ్చుపెడుతున్న బీజేపీ దేశద్రోహుల పార్టీ అని ధ్వజమెత్తారు. కేసీఆర్‌తో తెలంగాణ ఆవిర్భవించలేదన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కోదండరాం పోరాటం, 12 వందలమంది బలిదానాలతో రాష్ట్రం ఆవిర్భవిస్తే లక్షల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్న కేసీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలపై కాంగ్రెస్ పార్టీతో అంశాలవారీగా పోరాటం చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ అలుపు లేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువ్వారి రమేశ్, పాతూరి రమేశ్, జీడి ఎల్లయ్య, భువనగిరి కుమారస్వామి, నీల కనకయ్య, చామకూర యాకూబ్, మోతె శ్రీశైలం, గుగులోత్ సఖి, పాతూరి ప్రశాంత్, ఎస్.రాజు పాల్గొన్నారు.

అండర్–19 జిల్లా జట్టు ఎంపిక



అండర్–19 జట్టు క్రీడాకారులతో సంఘం బాధ్యులు


వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల రెండో వారంలో జరగనున్న హెచ్‌సీఏ టు డే లీగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తుది జాబితాను వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. మే 19 నుంచి జూన్ 3వ తేదీ వరకు హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 19 మంది క్రీడాకారులతో జట్టును ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.సెలక్షన్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కోచ్‌లు మహ్మద్ అఫ్జల్, పవన్ పర్యవేక్షణలో తుది జట్టు ఎంపిక చేశారు. జట్టులో స్థానం దక్కించుకున్న వారిలో బి. వరుణ్ (కెప్టెన్), కె. రోహిత్‌రెడ్డి, ఎం. శివరామ్, ఎన్. రాహుల్, ఎ. లక్ష్మణ్, ఎం. దేవేందర్, పి. రిశ్వంత్, ఎం. రామ్‌చరణ్, ఎస్. ఆదర్శ్, ఎం. రోహిత్, వి. వైష్ణవ్, జె. పార్థిపన్, డి. మనోజ్, బి. మణిదీప్ సింగ్, ఎం. రాణాచరణ్, నితిన్‌పటేల్, పి. సంతోశ్, బి. సతీశ్, పూజిత్ ఉన్నారు.

ఫైనాన్స్ కంపెనీ మోసం.. వ్యక్తి హఠాన్మరణం

పాలకుర్తి టౌన్: అధిక రాబడి ఆశ చూపి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నిండా ముంచడంతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన పాలకుర్తి మండలం ముత్తారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బడికే సోమన్న (39) గతేడాది అప్పు చేసి హైదరాబాద్‌లోని మదాపూర్‌కు చెందిన 12 వెల్త్ క్యాపిటల్ అనే ప్రైవేట్ కంపెనీలో రూ. 8 లక్షలు 4 శాతం వడ్డీ ఆశతో డిపాజిట్ చేశాడు. మొదట రెండు, మూడు నెలలు వడ్డీ వచ్చింది. అయితే ఏడాది మధ్యలో కంపెనీ కార్యకలాపాలు ఆగిపోవడంతో మోసపోయానని గ్రహించాడు. ఇంతలో అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో ఇంటిని తాకట్టు పెట్టి కొంత మందికి చెల్లించాడు. బ్యాంకు నుంచి ఈఎంఐ, వడ్డీ చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు.

దుస్తులు ఆరేస్తూ మృత్యుఒడికి..

- విద్యుత్ షాక్‌తో మహిళ మృతి
- తొర్రూరులో ఘటన



శైలజ(ఫైల్)

తొర్రూరు : దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన ఓరుగంటి శైలజ(35), వీరేశ్ దంపతులు కొంత కాలంగా తొర్రూరులో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త ఆటో నడుపుతుండగా శైలజ ఇళ్లలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజుమాదిరిగానే దుస్తులు ఉతికి ఇంటి ఎదుట ఉన్న వైరుపై ఆరేస్తుండగా ఆ తీగకు విద్యుత్ ప్రసరించి షాక్ తగిలింది. దీంతో అపస్మారక స్థితికి చేరిన శైలజను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఇంట్లో దుస్తులు ఆరేసేందుకు వైరు ఏర్పాటు చేయడంతోనే శైలజ మృతి చెందిందంటూ ఇంటి యజమానిపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈఘటనపై వీరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు.

మర్రిపల్లిగూడెంలో చెరువులో పడి మరో మహిళ..



సుగుణ మృతదేహం

కమలాపూర్: చెరువులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మర్రిపల్లి గూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట సుగుణ (55) సోమవారం సాయంత్రం తమ గేదెను మేతకు తీసుకెళ్లింది. అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో నడిమికుంటలో చెరువులో గేదెకు నీరు తాగించడానికి తీసుకెళ్లింది. అక్కడ గేదె ఒక్కసారిగా చెరువులోకి సుగుణను లాక్కెళ్లడంతో ఆమె నీట మునిగింది. సుగుణ రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం చెరువులో మృతి చెంది కనిపించింది. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

క్షణికావేశం.. తీరని శోకం

క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఆ కుటుంబాలకు తీరని శోకం మిగిల్చాయి. నిత్యం మద్యం తాగొద్దని అన్నందుకు ఒకరు, గేదె విక్రయించగా వచ్చిన డబ్బులు ఇవ్వాలని కుటుంబీకులు కోరగా అందుకు ససేమిరా అని వారితో గొడవ పడి మరొకరు, ప్రేమ విషయంలో ఓ యువకుడు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇలా కారణం ఏదైనా కానీ ఆలోచించకుండా కఠిన నిర్ణయాలు తీసుకుని తనువులు చాలించారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

బయ్యారం: నిత్యం మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని ఉప్పలపాడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బాలు(61) నిత్యం మద్యం తాగుతుండడంతో భార్య అమ్మి మందలించింది. దీంతో బాలు గత నెల 24వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబసభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గేదె అమ్మిన డబ్బుల విషయంలో గొడవ పడి రైతు..



ఈరు (ఫైల్)

సంగెం: గేదె అమ్మిన డబ్బుల విషయంలో గొడవ పడి మనస్తాపం చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలం బీకోజీనాయక్ తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకుచెందిన మూడు ఈరు(49), పద్మ దంపతులకు ఒక కుమారుడు వెంకటేశ్, ఒక కూతురు ఉన్నారు. ఈరు గేదెను అమ్మి డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తనవద్దే ఉంచుకున్నాడు. ఇంటి ఎదుట సంపు నిర్మించడానికి డబ్బులు ఇవ్వమని కుమారుడు వెంకటేశ్ అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని ఈరు సోమవారం ఉదయం గొడవ పడి వ్యవసాయ బావి వద్ద పని ఉందని వెళ్లాడు. సాయంత్రం భూమి పక్కనగల రైతు లక్ష్మణ్ ఫోన్ చేసి ఈరు బావి వద్ద పడి ఉన్నాడని తెలపడంతో వెళ్లి చూడగా నోటి నుంచి నురగలు వస్తున్నాయి. 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

ప్రేమ విషయంలో బెస్తగూడెంలో యువకుడు..



విజయ్ (ఫైల్)

వెంకటాపురం(కె): మండలంలోని బెస్తగూడెం గ్రామంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేగ విజయ్(22) ఎలక్ట్రీషన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విజయ్ కొంత కాలంగా యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఏమైందో తెలియదు కాని యువతి విషయంలో మనస్తాపం చెందుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపారు.